మూ॥ సఙ్కీర్తయన్త్యో, జగతాంతజనన్యాః
కల్యాణవార్తాః కమనీయకీర్తేః।
ఇమాః ప్రమోదాయ సతాంభవన్తు
సన్దర్భశుద్ధా ఉపజాతయోనః॥ 25

రమణీయ కీర్తియగు జగజ్జనని యొక్క కల్యాణవార్తలను సంకీర్తన మొనర్చునవియు, సందర్భ శుద్ధములయినవియు, నిట్లు రచింపఁబడి నవియు నగుమాయీ – ఉపజాతులు సజ్జన ప్రమోదదాయకములగుఁగాత.

**ప్రభ:**- సందర్భమనఁగా, నిబంధింపఁబడిన పదవాక్య గుంఫన రూపమగు రచనము, శుద్ధములనఁగా, పద – పదార్థ – వాక్య – వాక్యార్థదోష రహితములు. ఉపజాతులనగా, ఉపజాతివృత్త నిబద్ధములగు శ్లోకములు.

'ఇది సవ్యాఖ్యమగు పంచమస్తబకము'
ఓమ్ – తత్ – సత్ –

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ
శ్రీ భారతీ దేవ్యై నమః

# ఉమా సహస్రము

## (ద్వితీయ శతకమున – ద్వితీయస్తబకము)

### ఆరవ స్తబకము

**అవ :**- ద్వితీయ శతకము యొక్క ద్వితీయ స్తబకమగు నిందు – దేవి యొక్క 'విశ్వవైభవ సంపత్తి' స్తుతింపఁబడును.

మూ॥ హర్తారః శశికీర్తేః
కర్తారో నవభాసామ్।
భర్తారో మమసన్తు
స్కన్దామ్బాదరహాసాః॥ 1

చంద్రునకుఁగల ఖ్యాతిని హరించునవియు, క్రొత్తక్రొత్తలగు కాంతులను కలిగించునవియు, నగు స్కందాంబ (పార్వతి) యొక్క మందహాసములు నన్ను భరించునవియగుఁగాత!

**ప్రభ:**- ఆహ్లాదకత్వాది గుణములచే – అమృతకిరణుని యశమును గూడ నతిశయించునవియు, నవనవ వికాసముచే విలసిల్లునవియు, ( ఆశ్రితులకు అభినవాభ్యుదయమును గలిగించునవియు) అగు పార్వతి మందస్మితములు – భక్తుఁడనగు నన్ను పోషించును గాతయని యభ్యర్థనము కావింపఁబడినది.

మూ॥ దిగ్వల్లీష్వతి శుభ్రం
కుర్వన్తః కుసుమర్ధిమ్।
భూయాసుస్తవ భూత్యై
మన్మాతుః స్మితలేశాః॥ 2

దిక్కులను లతలయందు మిక్కిలి శుభ్రమగు కుసుమ సమృద్ధిని (పుష్ప ప్రసూతి సంపదను) కలిగించుచున్న మాతల్లి యగు పార్వతి యొక్క మందహాస లేశములు – మీకైశ్వర్యమును ఘటించుఁగాత!

**ప్రభ:-** ఇది మంగళాశాసనము, ఇచట '' దిశ ఏవ వల్ల్యస'' అను వ్యుత్పత్తి చేత, ఉత్తర పదార్థము ప్రధానమగుట వలన, ఇది అవధారణాపూర్వ పదకర్మ ధారయ సమా సమేయగును కాని ''వల్ల్య ఇవదిశః'' అను వ్యుత్పత్తి చేత పూర్వ పదార్థ ప్రధానమగు ఉపమిత సమాసము కాదు. కుసుమ సమృద్ధికరణములు – వల్లులు గాని దిక్కులు – కావు గదా! స్మితలేశములు, కుసుమ సమృద్ధి కారకములగుట చేత నవి అమృత కిరణాత్మకములను నంశము గమింపఁజేయఁబడినది. రసాత్ముకుఁడగు సోమునకే ఓషధీశత్వము ప్రసిద్ధము గదా! దిగ్వల్లులనుచోట – ఏక దేశ వివర్తియగు రూపకము – అలంకారమని గ్రహించునది. కుసుమ ప్రసవ సంపన్నములగు లతలు స్పృహణీయ శోభలగునట్లు పార్వతీ మందహాసముల వలన దిక్కులన్నియును, స్వోచిత రమణీయ శోభా సంపన్నము లగుచుండునని భావము.

మీఁది శ్లోకమున దిగ్వల్లీషు ( దిక్కులను లతలయందు) అను బహు వచనము వలన మందహాస వైభవము సార్వత్రికము (అంతటను ప్రసరించునది) అని చెప్పబడియెను.

''మందహాస వైభవము – మహా ప్రభావము గలది. ఆ మందహాస వైభవము వలననే విశ్వమునందున్న – సర్వవస్తువులును – సర్వభూతములును వానివాని గుణములతో గూడ ధరింపఁబడుచున్నవి.'' అని స్ఫురింపఁజేయుటకు – దిక్ సంతతికి– విచ్ఛేదము లేని వికాసమును వ్యంజింపఁ జేయునదియగు – దిగ్ – వల్లీ – కుసుమ ప్రసవసమృద్ధి కరణము – చెప్పఁబడినది.

ఇందు దిక్కులను – వల్లులుగా నారోపించుట – శాబ్దము. కర్తలగు స్మితలేశముల చేత – కుసుమ సమృద్ధి– యారోపింపఁబడినది. దాని చేత – నగు అర్థ సామర్థ్యము చేత – దిగ్ వికాసము – ఆక్షేపింపఁబడుచున్నది. (తీసికొని



రాఁబడుచున్నది) దిక్కులు వికసించినవనునర్థము శబ్దము చేతఁగాక, అర్థము చేత నాక్షిప్తమగుట వలన – ఆ దిగ్వికాసము – అర్థమైయున్నది. ''వికసించిన పూవులు గలిగియుండుట'' అనుధర్మము దిక్కులయందుపచరితమగుట వలనను – దిక్కులుగా నారోపింపఁబడిన వల్లులయందుండుటవలనను – ఇది – ఏక దేశ వివర్తినియగు నుపమ కానేరదని తెలియునది.

మూ॥ ఏకశ్చేత్ తవశక్తో
బ్రహ్మాణ్డస్య భవాయ ।
భర్గప్రేయసి హాసః
కిం స్తోత్రం తవ భూయః. ॥ 3

భర్గ ప్రేయసివగు జననీ! నీహాసమొక్కటియే, బ్రహ్మాండము యొక్క ఉద్భవమునకు సమర్థమగునపుడు నీ మహాభాగ్యమును వ్యాఖ్యానించుటకు ఏ స్తోత్రమైనను సమర్థమగునా?

**ప్రభ:-** భగవతీ ముఖము నందు – హాసమెల్లప్పుడును వికసించుచుండును. నీవొక క్షణము నవ్వినచో – జగమంతయు నుదయించును. అట్టి యెడల నీ మహాభాగ్యమును వర్ణింపఁజాలిన స్తోత్రమేదియైనను నుండునా?

''స్మితము – జగత్ స్రష్టు'' అను నంశమును పూర్వ గ్రంథకర్తలుగూడ వర్ణించియే యున్నారు.

భామతీకారులచేత ''స్మితమేతస్య చరాచరమ్'' అని స్వకృతబ్రహ్మసూత్ర భాష్య వ్యాఖ్యారంభమున బ్రహ్మము స్తుతింపఁబడినది గదా!

భామతీకారుఁడగు వాచస్పతి మిత్రుని చరిత్రము నాచేరచిపంబడిన, భామతి అను ఖండ కావ్యమున పాఠకులు పరిశీలింపగోరెదరు. (పం॥ ల॥ నా)

మూ॥ ఉద్యానేవియదాఖ్యే
కాలి! త్వాం విహరన్తీమ్।
గోళైః కన్దుకకల్పై
రల్పావాక్ కిముమాతి. ॥ 4

భగవతివగు కాలీ! ' ఆకాశము' అను పేరుగల ఉద్యానము నందు కందుక కల్పములగు ( గోళాకారములగు బంతులవంటివై రవీందు నక్షత్ర రూపములగు) ఖగోళములతో నాడుకొనుచున్న నిన్ను స్వల్పమగు వాక్కు – ఎట్లు వర్ణించును?

**ప్రభ:**- అనంతములగు బ్రహ్మాండ కోటుల కవకాశము నొసఁగు నాకాశము– నీకు విహారోపవనమై యున్నది. అచటనున్న జ్యోతిర్గోళములు నీకాటబంతులై యున్నవి. ఇట్లుండ నీవింతదానవని పరిమితిఁదెలుపుట కేవాక్కు సమర్థమగును? ఇయత్తా – పరిచ్ఛేద – రహితయగు భగవతి – వాక్కుల కందదని భావము.

మూ॥ ఖం క్రీడాభవనంతే,
కః కార్యాలయ ఏషః।
పృథ్వీయం బహులాన్నా
మాతర్భోజనశాలా! ॥ 5

తల్లీ! సర్వ వ్యాపకమగు ఆకాశము – నీకు క్రీడాభవనము. ( విహార స్థలము) ఈయాదిత్య మండలము – నీ కార్యాలయము – ( జగత్కార్య నిర్వాహక ప్రదేశము) బహులాన్నమగు నీభూమి – నీభోజనశాల.

**ప్రభ:**- ఇచట దేవీ విషయమున భోగ – భోజనములకు విశేషములేదని యెఱుఁగునది. సంస్కృతము నందు ''కః'' అను పదము, బ్రహ్మను, ఆత్మను, వాయువును, సూర్యుని, దెలుపునని విశ్వ ప్రకాశుఁడు చెప్పియున్నాఁడు.



అధికారికులగు ( ఆయాయుద్యోగములందు) నియమితులగు దేవతలకు– జగత్కార్య నిర్వాహక్రమము వ్యవస్థాపింపబడిన ప్రదేశము – స్వర్లోకమగు నాదిత్య మండలము. కావున నయ్యది కార్యాలయమని చెప్పఁబడినది. ఆట వస్తువులగు ఖగోళములతో నా పరమేశ్వరి విహరించు ప్రదేశము భువర్లోకమగు నంతరిక్షము కావున నది – క్రీడా భవనమని చెప్పఁబడినది. అధికారికులగు దేవతల ద్వారమున పరమేశ్వరిచే భుజింపఁబడుచున్న ప్రదేశము – ఈ భూలోకము. కావున నది – భోజన శాలయని చెప్పఁబడినది.

ఇట్లు – వేద మంత్రమున ''భూః భువః, స్వః'' అని చెప్పఁబడిన లోకములు మూఁడును, సర్వేశ్వరికి క్రమముగా, భోజన – విహార – కార్యాలయ స్థలములగుచున్నవని ప్రతిపాదింపఁబడినది.

మూ॥ బుద్ధీనా మసి దాత్రీ
సిద్ధీనా మసి నేత్రీ।
వీర్యాణా మసి పేటీ
కార్యాణా మసి ధాటీ ॥ 6

అమ్మా! సకలకలావిష్కర్తలును శాస్త్రీయములును అగు బుద్ధుల నొసఁగుదానవును, అణిమాద్యద్భుతరూపములును, సర్వోద్యమ ఫల రూపములును అగు సిద్ధులను సంఘటించుదానవును! వీర్యములకు మంజూషవును, (సకల విధ పరాక్రమ నిధానభూతవును) కార్యములకు అభ్యాసాదనమవును (పరచక్రము నాక్రమించుదానవును) అగుచున్నావు.

**ప్రభ**- ''ధాటీ'' అను పదమునకు – అభ్యాసాదనమర్థమని హేమ చంద్రుడు చెప్పెను.

మూ॥ విద్యానామసి భావో
హృద్యానామసి హావః।
దేవానా మసి లీలా
దైత్యానా మసి హేలా. ॥ 7

నీవు వేదాదులగు చతుర్దశవిద్యలకును తాత్పర్య రూపమగు భావమవు. రమణీయములగు వస్తువు లన్నిటియందును విలాసరూపమగు హావమవు. దేవతలయందు స్పృహణీయ (మగు) విలసిత మగులీలవు. దైత్యులను తిరస్కరించు హేలవు.

**ప్రభ:-** హేల యనఁగా అవజ్ఞ, అవజ్ఞా విలాసముల యందు హేలా పదము వర్తించునని నానార్థ రత్నమాల చెప్పుచున్నది గదా!

మూ॥ గన్తౄణా మసిచేష్టా
స్థాణూనామసి నిష్ఠా।
లోకానామసి మూలమ్
లోకాదే రసి జాలమ్. ॥ 8

గన్తలగు చరప్రాణులకు గతివి, స్థాణువులగు స్థిరవస్తువులకు స్థితివి. సర్వలోకములకును మూలమవు. లోకుల జన్మములకు జాలమవు. (మాయికమగు కారణమవు.)

**ప్రభ:-** జాల శబ్దము సంస్కృతమున పుంలింగమగునపుడు నీప వృక్షమును, స్త్రీ లింగమగునపుడు బీర చెట్టును, నపుంసకలింగమగునపుడు దంభ - ఇంద్రజాలములును అర్థములగునని త్రికాండ శేషము చెప్పుచున్నది. ''చర - స్థిరములకు - చరత్వ-స్థిరత్వ - ధర్మ రూపిణివి నీవే'' యనియైనను చెప్పనగును.

మూ॥ దేవీ, వ్యాపక తేజః
శక్తి, స్తత్త్వవిచారే।
అత్యన్తం సుకుమారీ
నారీ, మూర్తి విచారే ॥ 9



పరమార్థమును విచారించునపుడు ఉమా దేవి - వ్యాపక తేజశ్శక్తి యగుచున్నది. ఆయమ్మ మూర్తిని విచారించునపుడు అత్యంత కోమల గాత్రియగు పార్వతి యగుచున్నది.

**ప్రభ:-** వ్యాపక తేజశ్శక్తియన ''సర్వ వ్యాపియగు జ్యోతిస్సగు సర్వేశ్వరుని శక్తి'' అని గాని ''వ్యాపక తేజో రూపిణియగు శక్తి'' అని గాని యర్థముఁ జెప్పవచ్చును. వ్యాపక తేజోరూపిణియగు శక్తి అని చెప్పునపుడు శాక ప్రియః, పార్థివః= శాకపార్థివః అని జెప్పునట్లు, తేజోరూపిణీ, శక్తిః = తేజశ్శక్తిః'' అని సమాసమును జెప్పుకొనవలయును.

తత్త్వమును విచారించు నెడల - దేవీ స్వరూపము - సర్వ వ్యాపి తేజశ్శక్తియు- విగ్రహవత్త నపేక్షించు నెడల - సుకుమారియగు నారియునగునని భావము.

మూ॥ క్వజ్యోతి ర్మహతోఽస్మా
దాకాశాదపి భూయః? ।
తత్సర్వం వినయన్తీ
తన్వఙ్గీక్వనునారీ? ॥ 10

వ్యాపకమగు నాకాశముకంటెను గూడ మహత్తరమగు జ్యోతిస్సెక్కడ? ఆకాశము నతిశయించుచు, మహతో మహీయమగు ఆ జ్యోతి స్సర్వమును జగన్నిర్మాణము కొఱకు చలింపఁజేయుచున్న తన్వంగి (కృశించిన దేహము గలది) యగుసుందరి యెక్కడ? (ఆశ్చర్యము గదా!)

**ప్రభ:-** మహతోమహీయమగు జ్యోతిస్స్వరూపమును జగన్నిర్మాణము కొఱకు చరింపఁజేయుట అర్థసిద్ధి. దానికిచట నసంభావ్యత - వర్ణితము. కావున ''ప్రత్యఙ్గబంధమ్'' అని వెనుకటి శ్లోకము వలె నిదికూడ- అసంభవాలంకారమునకే లక్ష్యమగునని గ్రహించునది.

**అవ:**- ఇక్కడనుండి '' ఆశ్చర్యం విదధానా'' అను పదునైదవ శ్లోకము వఱకును గల వాక్యమొక్కటియే యని గ్రహించునది.

మూ॥ దేవేన్ద్రాయవిభుత్వమ్
సూర్యాయో[స సహస్రమ్।
ఊష్మాణాం దహనాయ
జ్యోత్స్నా మోషధిరాజే. ॥ 11

దేవేంద్రునికి ఈశితృత్వమును, ప్రభుత్వమును, సహస్రరశ్మియగు సూర్యునకు కిరణ సహస్రమును (వేయి కిరణములను) కాల్చువాఁడగు నగ్నికి వేడిమిని, ఓషధుల కధిపతియగు చంద్రునకు వెన్నెలను ( నీవొక్కతేవే యిచ్చుచున్న దానివని పదునాల్గవ శ్లోకముచే సమన్వయించుకొనునది.)

మూ॥ వాతాయామిత వీర్యం
విస్తారం గగనాయ।
సాన్ద్రత్వం వసుధాయై
తో యాయ ద్రవభావమ్. ॥ 12

(జగత్ప్రాణుఁడగు) గాలికి అత్యధికమగు బలమును, ఆకాశమునకు వైశాల్యమును, భూమికి నిబిడత్వమును (ఘనీభావమును) నీటికి ద్రవత్వమును (ద్రవీభావమును).

మూ॥ మహాభాగ్య మపారం
కోటిభ్యో విబుధానామ్।
చిత్రాః కాశ్చన సిద్ధీ
ర్లక్షేభ్యో మనుజానామ్. ॥ 13

దేవకోటులకు, అమితమగు మహాభాగ్యమును, మనుజలక్షలకు అద్భుతములు అనిర్వాచ్యములు అగు సిద్ధులను.



**ప్రభ:**- 'కోటి' అనునది శతలక్ష సంఖ్యావాచకమును, లక్ష – శతసహస్ర సంఖ్యావాచకమును, అగును ( కోటియన నూరులక్షలు. లక్షయన నూరువేలు,) అయినను ''దేవ కోటులకు'' అనుదానికి ''అమిత సంఖ్యులగు దేవతలకు'' అనునర్థమును, ''మనుజలక్షలకు'' అనుపదమునకు, 'అత్యధిక సంఖ్యలగు మనుష్యులకు'' అనునర్థమును గ్రహింపవలయును. అపారమనఁగా అనంతమని యర్థము. మహాభాగ్యమన, గొప్పదగు నైశ్వర్యాంశమని యర్థము.

మహాన్ భాగో అంశః యేషాంతే, మహాభాగాః తేషాంభావో మహాభాగ్యమ్. గొప్పదగు నైశ్వర్యాంశము గలవారు మహాభాగులు. తద్ భావము మహాభాగ్యము.

మూ॥ స్థాణుభ్యో ధృతిశక్తిం
గన్తృభ్యో గతిశక్తిమ్।
కస్మాచ్చిన్ని జకోశా
దేకా దేవి దదానా. ॥ 14

దేవి! కదలని వస్తువులకు ధృతిశక్తిని, కదలెడు ప్రాణులకు గతి శక్తిని, ఇట్లు పూర్వోక్తమగు సర్వమునుగూడ అనిర్వాచ్యమగు నిజకోశము నుండి నీవొక్క తెవే ఇచ్చుచున్న దానవు.

**ప్రభ:**- ధృతిశక్తియనఁగా స్థిరత్వము నొదవించు ధారణాసామర్థ్యము. గతిశక్తియనఁగా, గమనసామర్థ్యము. ఎనిమిదవ శ్లోకమున గంతలకు చరప్రాణుల యందలి ''చలనమును'' స్థిరవస్తువుల యందలి స్థితియుఁ గూడ దేవికి స్వరూపమని చెప్పఁబడియెను. ఈ శ్లోకమునందట్లుగాక, దేవి– చరాచరములకు 'గమనధారణా శక్తి దాత్రి' అని చెప్పఁబడినది.

పదునొకండవ శ్లోకమునుండియు చెప్పఁబడిన విభుత్వము మొదలు పదునాల్గవ శ్లోకమునఁ జెప్పఁబడిన గతిశక్తివఱకును గల సర్వమును గూడ అద్వితీయమగు ఉమాదేవి, చెప్పుటకు వీలుపడిని స్వీయనిధానమునుండి యిచ్చుచున్నదని భావము.

మూ॥ ఆశ్చర్యం విదధానా
సర్వంవస్తు దధానా ।
హన్తత్వం మమమాతః!
కాచిత్ కోమలగాత్రీ. ॥ 15

మాతల్లీ! అద్భుతమును అసామాన్యమును అగు కర్మను చేయుచున్నదానవును, చరాచరమగు విశ్వమునంతను ధరించుచున్నదానవును అగునీవు ఒకానొక కోమలగాత్రివై యున్నావు. ఆశ్చర్యము!

మూ॥ శ్రోణీభార నతాయాం
కస్యాం చిత్తనుగాత్ర్యామ్ ।
ఈదృశా యదిశక్తిః
కా వేతో ననుమాయా ! ॥ 16

శ్రోణీభారము చేత నమ్రయగు ఒకానొక తను గాత్రియందు (అల్పమగు గాత్రము గల స్త్రీయందు) అఘటన ఘటనాపటీయసియగు నిటువంటి శక్తియుండు నెడల నింతకంటె మాయ యింకేమున్నది?

**ప్రభ:**- పూర్వోక్తప్రకారమై విలసితమగు శక్తి యొకానొక కాంతయందుడుట మాయకాక వేఱేమగునని భావము.

'కావాతే ననుమాయా' అను పాఠమునందు నీమాయ యింతకంటె వేఱగునా? అనునర్థము సిద్ధించును, కావున నుభయ పాఠములందునుగూడఁ గల తాత్పర్యమొక్కటియే యగును.

మూ॥ రూపంతే - తనుగాత్రం
వాణీతే - మృదునాదా ।
చాపంతే - మధురేక్షుః
పాణిస్తే - సుకుమారః ॥ 17



అమ్మా! నీరూపము తనుగాత్రము, నీవచనము మృదునాదము; నీ చాపము మధు రేక్షువు, నీహస్తము సుకుమారము.

**ప్రభ:**- నీ రూపము స్థూలముకాక యల్పమగుట చేత సుందరమగు గాత్రము కలది. నీవు సౌందర్య సంపన్నవగు అతిలలిత గాత్రివని భావము. నీమాట మంజులమగు స్వరముకలది. నీవు కల కంఠివని భావము. నీ ధనువు తీయని చెఱకు. కావున నీవు స్వాధీన కామవగు కామేశ్వరివి. కాముఁడు - ఇక్షుదనుష్కుఁడనునది ప్రసిద్ధము. ఆ చెఱకు విల్లు నీయదియే యగుట వలన నీవు వశీకృతకామవగుచున్నావని భావము. నీ పాణి కోమలము.

మూ॥ లోలే! లోచనయుగ్మే
భీరుత్వం ప్రకటం తే ।
బ్రహ్మాణ్డం త్వ దధీనమ్
శ్రద్ధత్తా మిహకోవా. ॥ 18

చంచలయగు దేవి! నీ నేత్రయుగళమున భీరుత్వము ప్రకాశించుచుండును. అయినను ఈ బ్రహ్మాండమంతయు నీయధీనమునందున్నది. ఈయంశమును నెవఁడు విశ్వసించును?

**ప్రభ:**- పూర్వోక్తప్రకారమున నీరూప, వచన, చాప, హస్త, నయనములు- ఇట్లింత లలిత రమణీయములగుచుండినను గూడ నీవిశ్వము త్వదధీనమైయున్నది. ఈ యంశమే నమ్మశక్యముగాకున్నదని భావము.

మూ॥ భ్రూభఙ్గం కురుషేచే
న్ముగ్ధే! గౌరి ! ముఖాబ్జే ।
భూతాన్యప్యయిబిభ్య
త్యే జేరన్నపి తారాః. ॥ 19

ముగ్ధవు గౌరివి అగుపార్వతీ! నీవు వదనకమలమున భ్రూభంగమొనర్చితివా, పృథివ్యాది భూతములన్నియు భయపడును. నక్షత్రములు కంపించును.

**ప్రభ:**- లజ్జావిజిత మన్మథయగు ఉదయద్ యౌవనముగ్ధయనియు, దశవర్ష వయస్కయగు ఆముగ్ధబాలిక – గౌరియనియు చెప్పఁబడును. అట్టి ముగ్ధయు, గౌరియునగు పార్వతి రోషము చేత నొనర్చిన భ్రూభంగము తటస్థుఁడగు కవికి రమణీయమై యున్నను భూత నక్షత్రాదులకు భయకంపాదిప్రదమే యగునని భావము. ''భీషాస్మా ద్వాతః పవతే, భీషోదేతిసూర్యః'' ''బ్రహ్మమువలని భయమున వాయువు వీచును. సూర్యుఁడుదయించును'' అని శ్రుతిగదా!

మూ॥ శుద్ధాన్తేశ్వరి! శమ్భో
రిచ్ఛాచేత్ తవకాఽ పి।
ఘోరోఽగ్నిస్తృణగర్భాద్
ఘోరాగ్నేరపి శైత్యమ్. ॥ 20

ఓ శివాంతః పురసుందరీ! నీయిచ్ఛామాత్రమున, తృణగర్భము నుండి, భీషణాగ్ని జనించును. అభీషణాగ్ని నుండి శైత్యము (చల్లదనము) ఉదయించును.

**ప్రభ:**- తృణమనఁగా గడ్డిపరక. దాని నుండి ఘోరమగు నగ్ని నుదయించుట అస్త్రవిద్యా ప్రసిద్ధము. అనుష్ణమగు తృణమునుండి ఘోరమగునగ్ని జనించుట చేత శరవణజమగు నగ్ని సూచింపఁబడుచున్నది. అగ్ని నుండి శైత్యముదయించు ననుటచేత ''అగ్నే రాపః'' అను శ్రుతి ప్రసిద్ధమగు తత్త్వము ప్రవచింపఁబడినది.

ఇచట ముఖ్యముగా గ్రహింపఁదగిన యర్థము, ''నీయిచ్ఛకు శక్యము కాని దేదియును లేదు.'' నీవు తలఁపరాని యద్భుతములను సాధించు స్వతంత్రురాలవు.'' అనునదియే.



**అవ:**- ఇప్పుడు శివ శక్తులకుఁ గల కార్య విభాగమును ప్రదర్శించుచున్నాఁడు.

మూ॥ ద్రష్టుం విశ్వమపారం
భారస్తేదయితస్య।
కర్తుం కార్యమ శేషం
శ్రీమాతస్తవభారః ॥ 21

శ్రీ మాతా ! అపారమగు విశ్వము వీక్షించుటయే నీ భర్తకుఁ గల కార్యభారము. సృష్ట్యాదికార్యము నిశ్శేషమొనర్చుట నీకుఁగల కార్యభారము.

**ప్రభ:**- సర్వేశ్వరుడు జగదభిముఖియగు దృష్టిని మాత్రమే ప్రసరించుచు సాక్షియగుచున్నాఁడు; కాని సర్వేశ్వరివగు నీవే సర్వకార్య నిర్వాహికవని భావము. మీదిశ్లోక మీయంశమునే స్ఫుటీకరించును.

మూ॥ సాక్షీ కేవల మీశః
కర్తుం భర్తుముతాహో।
హర్తుంవాఽఖిలమమ్బ!
త్వం సాక్షాద్ ధృతదీక్షా. ॥ 22

అమ్మా! ఈశ్వరుడు కేవలమును సాక్షి ( ద్రష్ట) యగుచున్నాఁడు. నీవు సర్వమును సృజించుటకు గాని భరించుటగాని హరించుటకుఁగాని దీక్షఁబూనినదానవు.

**ప్రభ:**-సృష్టి – స్థితి – సంహారములయందు పరమేశ్వరి 'బద్ధవ్రత' అని చెప్పుట చేత సాక్షిత్వద్వారమున నీ కార్యములయందు పరమేశ్వరునకు అభ్యనుజ్ఞాన రూపమగు పరంపరాసంబంధము గమింపఁజేయఁబడుచున్నది.

మూ॥ కారణ్కారముమే ! యద్
బ్రహ్మాణ్డాని నిహంసి ।
తన్మన్యే సురమాన్యే
బాలై వామ్బ ! సదాత్వమ్. ॥ 23

సుర పూజ్యవగు జగదంబా ! బ్రహ్మాండములను రచించి రచించి భంజించుచుందువు, గావున నీవెప్పుడును గూడ బాల వేయగుదువని తలంచుచున్నాను.

ప్రభ:- శైశవదశయందు బాలురు క్రీడా వస్తువులను చేసి చేసి వానిని మరల భంజించుచుందురుగదా ! ఇచట హేతువు కాని బాలాత్వము – బ్రహ్మాండములను మరల మరల సృజించి సంహరించుటకు హేతువుగా నుత్రేక్షింపఁబడినది, కావున నిది హేతూత్ప్రేక్ష యగుచున్నది.

దీని చేత – ''అనాయాససిద్ధములగు భగవతీలీలా విలాసితములే – సర్గాదికార్యములు'' అనునంశము ద్యోతితము.

మూ॥ లీలోజ్జీవితకామే !
రామే ! శఙ్కరసక్తే ! ।
త్వత్ పాదార్చనసక్తం
భక్తం మాంకురుశక్తమ్, ॥ 24

శంకరునందనురక్తవై, శృంగారలీల చేత కాము నుజ్జీవింపఁజేసిన సుందరీ ! భవత్పాదార్చనానురక్తుఁడను భక్తుఁడను అగు నన్ను శక్తియుక్తునిగాఁ జేయుము.



ప్రభ:- హరనేత్ర దగ్ధుఁడగు కందర్పునకు, అనాయాససిద్ధమగు విలాసము చేత పునర్జీవనము నొసంగితివి. త్వచ్చరణ సేవాసక్తుఁడనగు నాకు బలము నొసంగుమని భావము. ఆధ్యాత్మికముగాని, అధిలౌకికముగాని, కార్యమేదయినను బలము లేనిదే నిర్వహింపఁబడదు గదా ! ''నాయమాత్మా బలహీనేన లభ్యః'' 'ఈ యాత్మ బలహీనునకు లభింపఁదు' అని వినఁబడుచున్నది. కావున నన్ను శక్తిమంతునిగాఁ జేయుమని ప్రార్థించుచున్నాడు.

మూ॥ ఏతాః పావనగన్ధాః
సర్వేశప్రమదే ! తే ।
హైరమ్బ్యోమదలేఖాః
సన్తోషాయభవన్తు ॥ 25

సర్వేశ్వరప్రమదవగు పార్వతీ ! పవిత్ర పరిమళోపేతములును నీ పుత్రుఁడగు గణపతికి సంబంధించినవియునగు మదలేఖలు ( మదధారలు – మదలేఖావృత్తములు) నీకు సంతోషదాయకములగుఁగాత !

ప్రభ:- ఇచట పార్వతీ సంతోషాశంసక – మద లేఖాపదము చేత, మీఁదిస్తబకమున నిబంధింపఁబడిన వృత్తము 'మదలేఖానామము' అను సూచ్యార్థము సూచింపఁబడినది కావున నిది ముద్రాలం కారమని చెప్పఁబడును.

ఇది సవ్యాఖ్యమగు షష్ఠస్తబకము
ఓమ్ తత్ సత్.

* * * *